# అది కాదు, మరే(

[ చిన్న కథ ]

“ఎలా వస్తాయిరా అన్నిమార్కులు? మాటికి ముందూ- అది కాదు, ‘మరే’ అని రాస్తావు కదా!” అన్నాడు మావయ్య నవ్వుతూ.

“పేపర్లలో కూడా రాస్తా రేమిటి అలాగ? పేపర్లలో రాయకూడదు. రాస్తారా, నాన్నా!”

రచయిత:

## పురాణం కుమారరాఘవశాస్త్రి, బి.యే.

తెల్లి కాగితాల రూళ్ళకర్రచుట్ట చేతిలో ఊగులాడించుకుంటూ ఇంట్లోకి వచ్చాడు కృష్ణుడు. పదేళ్ళ కుర్రాడు. చదివేది ఫస్టుఫారం. చక్కని పాలుకారే ముఖం. కృష్ణకర్ణామృతంలో శ్లోకాలు—వాళ్ళ నాన్న రాత్రిళ్ళు భోజనమయాక కూచోబెట్టి వాగించినవి—చాలవరకు కంఠోపాఠమే వాడికి. ఇరుగు పొరుగు వాళ్ళకుకూడా వాడంటే ఎంతో ప్రీతి. కనబడితే పిలిచి కాస్సేపు వాడి మాటలో, పాటలో ఆనందించి, మిఠాయిలతో సత్కరించి పంపిస్తారు.

జగన్నాథపండితుడు భాష్యం తిరగవేస్తూ కూచున్నాడు. నలభైయేండ్ల నైతికజీవనం ఆయన ముఖంలో బ్రహ్మవర్చస్సుగా పరిణతి పొందింది. మంచి దృఢమైన శరీరం. విద్యాసంపాదనకూ, ధనార్జనకూ బహుదేశాటనం చేసినవాడు కావటంచేత పచ్చి ఛాందసుడనటానికి వీల్లేదు.

అవి—సెకండుఫారం ప్యాసైనంతమాత్రాన ఏతాలూకా ఆఫీసులోనో వెంటనే ఉద్యోగందొరికే రోజులు; పట్టపరీక్షలో కృతార్థుడై వచ్చినవాణ్ణి అందలంలో ఊరేగించే దినాలు. జగన్నాథ పండితుడు అనుభవంవల్ల తెలుసుకున్నాడు: గౌరవంగా ధనార్జనచేయటానికి ఆంగ్లవిద్యే బాగా ఉపకరిస్తుందని. తన పాండిత్యం, శాస్త్ర పరిచయం తనదారిద్ర్యాన్ని రవంత కూడా తొలగించలేక పోతున్నవి. గుళ్ళోనో, శంకరమఠంలోనో, బోడెమ్మల ముందు భాష్యం చెబుతూ కూచోటం ఏమీ గౌరవంగా లేదు తనకు. ఏ జమీందారు ప్రాపునో నిల్చిపోదామంటే అది మూనాళ్ళభోగంగా పర్యవసన్న మౌతుందని భయం, జమీందార్ల సేవ కత్తితో ఆట...ఎన్నివిధాల ఆలోచించినా కుమారుడి భవిష్యత్తు నిష్కంటకంగా ఉండేందుకు వాణ్ణి ఇంగ్లీషు- చదువులో దింపడమే కర్తవ్యంగా కనిపించింది. కొన్నాళ్ళు ‘ప్రయివేటు’న చెప్పించి హైస్కూల్లో చేర్పించాడు కృష్ణుణ్ణి ఫస్టుఫారంలో.

కృష్ణుడు గుమ్మందగ్గర ఉండగానే జగన్నాథపండితుడు తలెత్తి చూచాడు. పుస్తకపఠనలో నిమగ్నుడై ఉన్నప్పటి గంభీరత ముఖంలో మాయమైపోయింది. దాని స్థానే ప్రసన్నత అంకురితమయింది. ‘ఎక్కడికి కెళ్ళావురా? అబ్బీ!’ అని ప్రశ్నించి మళ్ళీ భాష్యం చదువుకోడంలో పడ్డాడు.

‘మరే, కాగితాలు కొనుక్కొచ్చుకుందామని బజారెళ్ళాను.’ అంటూ ముందు కొచ్చాడు కృష్ణుడు. తండ్రికి పక్కగా గొంతు కూచుని కాగితాల్ని రూళ్ళకర్ర ఆకారంనుంచి దీర్ఘచతురస్రాకారానికి విప్పి నేలమీద పరచి తావుల్ని ఒక్కొక్కటే తీసి చింపటం ఆరంభించాడు. మధ్యమధ్య ముఖంతిప్పి తండ్రిగారికేసి చూస్తాడు. వాడి గుండెలో ఏదో విషయ

మొకటి ఎప్పుడు బయటపడదామా అని ఆదుర్దా పడుతున్నట్టున్నది. కానిప్పటికి——

'అదికాదు, నాన్నా! మరే—'

మాటకు అడ్డువచ్చాడు అపక్కనే విస్తళ్ళు కుడుతూ కూచున్న మేనమామగారు. 'ఏంరా, కృష్ణుడూ! పదిగంటలు దాటిపోయినట్టుంది; ఇంకా బడికి కదలవేంరా?' అని అడిగాడాయన.

మామగారు రెండు రోజులయింది, చుట్టంచూపుగా వచ్చి. రెండామడదూరంలో వున్న ఒక కుగ్రామంలో నివాసం; పౌరోహిత్యంవల్ల జీవనం.

బంధువు లందరికీ బాగా చదువుకున్న. జగన్నాథపండితుడిపట్ల ఎంత గౌరవమో కృష్ణుడంటే అంత వాత్సల్యం; శ్రద్ధగా చదువుకుంటాడనీ, అల్లరిపిల్లలతో తిరిగేవాడు కాడనీ, బుద్ధిమంతుడనిన్నీ. కృష్ణుడికంటికిమాత్రం వాళ్ళనాన్న ఒక్కడే సర్వజ్ఞుడు; మిగిలినవారంతా తన తండ్రికి తీసికట్టు; తన కంటికీ ఆనరు.

ఇవాళ ఆదివారం కాదూ! ఆదివారం బడి ఉండదని అంతమాత్రం కూడా తెలీదేం మామయ్యకు!

'అదికాదు, మావయ్యా! మరే, మాబడికి శని ఆదివారాలు 'హాలీడేస్' తెలుసా?'...హాలీడేస్ పదంతో తన ఆంగ్లభాషా వైదుష్యం బయటపడలే.

'ఆల్లీస్ ఏమిట్రా?'

కృష్ణుడికి నవ్వొచ్చింది. సరిగ్గా పలకటంకూడా చాతకాదే ఆయనకు!

'ఆల్డీస్ కాదు. మరే, హాలీడేస్ మావయ్యా! సరిగా పలుకు?'

'అంటే?'

'మరే, సెలవు లన్నమాట.'

ఇంగ్లీషుపదం అర్థం కాకపోతే కాకపోవచ్చు. అంతేగాని ఆదివారం బడి ఉండదన్న సంగతికూడా తెలీని అంత అలౌకికుడేమీ కాదు మావయ్య. ఆ వేళ ఆదివారం అన్న సంగతి చటుక్కున స్ఫురణకు రాకపోయి ఉండచ్చు. వాళ్ళ ఊళ్ళో బోర్డు ఎలిమెంటరీస్కూలు లేదా! అందులో తన ఇద్దరుకొడుకులూ చదువుకుంటున్నారు కాదా! కృష్ణుడు తన కాసంగతి ఒక మూఢుడికి తెలియజెప్పినట్టుగా చెప్పరావటమూ——తన అజ్ఞానానికి జాలిపడుతున్నట్టుగా వాడి ఉచ్చారణలో ధ్వనించటమూ——ఇంగ్లీషు పదం మిళాయింపుచేసి మాటాడుతూ వాడు తన ఆధిక్యత ప్రదర్శించుకోటమూ——అంతా ఆయనకు మనోరంజకంగానే ఉంది.

ఇంతలో వంటింటోనించి 'వంటయింది, భోజనానికి లేవచ్చు' అని కృష్ణుడితల్లి కేకవేసింది.

ఆ కేక వినిపించినవెంటనే కాకండా ఒకనిమిషం తర్వాత జగన్నాథ పండితుడు భాష్యంపుస్తకం మూసేశాడు.

మావయ్య కుట్టిన విస్తళ్ళు లెక్కవేస్తున్నాడు.

కృష్ణుడికి కాగితాలు సరిగా చింపటం చేతకావటంలేదు. వెధవది, మడతమీదుగా చినగదేం? అటో, ఇటో తొంగుకుతూనే ఉంది.

'ఎందుకు పాడుచేస్తావురా, నాయనా, కాగితాలు? అలా ఉంచు. నేను భోంచేసి వచ్చి కూచుని చింపి పెడతాను. నువ్వు పాతపాఠాలేమైనా చదువుకుంటూ కూచో' అన్నాడు పండితుడు కళ్ళజోడుతీసి 'కేసు'లో పొందుపరుస్తూ.

కృష్ణుడు మావయ్యకేసి తిరిగి చూచాడు. వినలేదుకదా ఆయన కొంపదీసి! తనకు కాగితాలు చింపటం చేతకాదన్న సంగతి ఆయనకెందుకు తెలియాలి?... విన్నట్టు లేదులే; వీనకర్రపుల్లలు గోడ పక్కకు నెట్టేసి- అంగవస్త్రం దులుపుకుంటూ దొడ్లోకి వెళ్ళిపోతున్నాడు... అయినా ఫస్టుఫారం చదువుతూ కూడా తావులు సరిగా చింపుకోలేకపోవటం ఏమీ బాగుంది కాదు...ఈసారి అతి జాగ్రతగా ప్రయత్నించి చూడాలి... లాభం లేదు; పక్క కొచ్చేసింది చినుగు... ఇంకోటి... అదీ అంతే. ఇక లాభంలేదు. కాగితాలన్నీ చుట్టబెట్టి అలమారలో దాచేశాడు.

వంటింటో పీటలమీద కూచున్నారు, బావమరదు లిద్దరూ, మళ్ళు కట్టుకుని. వడ్డనచేస్తోంది కృష్ణుడి

తల్లి. కృష్ణుడుకూడావచ్చి వంటింటి గడపమీద కూచుని రెండుమూడు ఇంగ్లీషుపద్యాలు చదివాడు రాగయుక్తంగా, ముఖ్యంగా మావయ్య వినాలని.

ఏమిటో జ్ఞాపకం వచ్చింది కృష్ణుడికి. మూడోపద్యం సగంలో ఆపేసి—

'మరే, నాన్నోయ్! ఇందాకనూ, కాగితాలు కొనుక్కుని వచ్చేస్తుంటేనూ, శేషుగారినాన్న కేకేసి పిల్చాడు. వాళ్ళిల్లు అక్కడే రావిచెట్టుదగ్గర ఉందిగా! మరే, నువు చూశావా మావయ్యా! శేషుగారి నాన్నను?'

'ఊహుఁ. నే నెరగనురా.'

'శేషుగాణ్ణి ఎరుగుదువులే. మరే, నిన్నసాయంత్రం మనింటికి రాలేదూ! మనదాంట్లో జామిచెట్టెక్కేడూ; అల్లరిచేస్తోంటే నువ్వు చెవి మెలబెట్టావే, వాడే. వాడికి, మరే, అన్నింట్లో సున్నాలే వస్తాయి మార్కులు.'

'మరి నీ కెన్నొస్తాయి రా కృష్ణుడూ?'—తల్లి అడిగింది- ఆమెకు తెలీకనా? తన కొడుకు ప్రతిభ అన్నగారికికూడా తెలియొద్దూ మరి!

'మరే, నా కన్నింట్లో అరవైకి పైనే.'

'ఎలా వస్తాయిరా అన్ని మార్కులు? మాటికి ముందూ 'అది కాదు', 'మరే' అని రాస్తావు కదా!' అన్నాడు మావయ్య నవ్వుతూ.

'పేపర్లలోకూడా రాస్తా నేమిటి అలాగ? పేపర్లలో రాయకూడదు. రాస్తారా నాన్నా?'

జగన్నాథపండితుడు ఒక్క చిరునవ్వుమాత్రం ప్రదర్శించాడు. అడిగాడు: 'అయితే శేషుతండ్రి ఎందుకురా, నాన్నా, నిన్ను పిల్చాడన్నావు?'

'మరే, ఉండు, చెబుతాను. ఆయన్నెరగ నంటున్నాడు మావయ్య. నువు చూచేవుంటావు మావయ్యా! మొన్ననువు కారుదిగి వస్తోంటే—దారిలో పెద్ద అరుగులు లేవూ? అయిల్లే వాళ్ళది. ఆయ నెప్పుడూ, మరే, పంచపాళీలోనే పడక్కుర్చీ వేసుకు పడుకుంటాడు. చూచావుకదూ! ఇంతింత కళ్ళు; ఇంతింత మీసాలు. మాయాబజారు-సినీమాలో, మరే, ఘటోత్కచుణ్ణి చూశ్శేదూ, అల్లాగే ఉంటాడు. ఇప్పుడు జ్ఞాపకం వచ్చిందా?'

'ఔనురా, చూచా'—అబద్ధం ఆడితేనేగాని కృష్ణుడు తృప్తిపడేట్టుగా లేదని తోచింది మావయ్యకు.

'మరే, ఆయన చేతిలో చుట్ట ఉందా, లేదా? చెప్పు.'

'ఉంది' అని కృష్ణుడు కోరిన జవాబునే చెప్పివేయడానికి ఎంతో ఆలోచించవలసిన అవసరమే లేకపోయింది మావయ్యకు. అది వాడి ప్రశ్నలోనే ఇమిడి వుంది.

'ఆయన ఎప్పుడూ చుట్ట కాలుస్తునే వుంటాడు. ఇంతింతపొడుగు చుట్టలు!—అదికాదు, నాన్నా! మరీ, తాను అన్ని చుట్టలు కాలుస్తాడుగదా! శేషు నిన్న ఒక్క బీడీకాల్చాడని చావదన్నేస్తున్నాడు నేను వెళ్ళేటప్పటికి.'

'నువ్వూ, వాడూ కలిసి బీడీముక్కలు తగలేస్తుండగా ఆయన కంటబడ్డది కాబోలు కొంపదీసి' అన్నాడు మావయ్య నవ్వుతూ

'ఛీ. ఛీ. నే నస్సలు తాగను. మనం బీడీలు తాగకూడదు. తాగొచ్చా నాన్నా?'

'మరి నిన్నుకూడా ఎందుకు పిల్చాడురా ఆయన?' మావయ్య క్రాసు ప్రశ్న.

కృష్ణుడు వివరాలు చెప్పాడు. గడచినరోజు సాయంత్రం తానూ, శేషూ, ఇంకా కొంతమంది పిల్లలూ చెరువుగట్టుకేసి షికారు వెళ్ళారు. అక్కడ కుషామత్తుగా శేషూ, ఇంకా ఇద్దరు ముగ్గురు పిల్లలూ బీడీలు కాల్చారు. ఈ సంగతి ఎలాగో శేషునాన్నకు తెలిసింది. దెబ్బలు తినలేక శేషు 'నేను బీడీలు కాల్చలేదు' అంటున్నాడు. వాళ్ళనాన్న నమ్మటం లేదు. కృష్ణుణ్ని పిల్చాడు సాక్ష్యానికి.

'సరే, ఇంకేం, వాడి ప్రాణా

నికి యమదూతలాగ నువ్వు తారసిల్లావన్నమాట.'—ఊహచేసి అన్నాడు మావయ్య. 'నిజం చెప్పి వాణ్ణి చావగొట్టించావా?' అని కూడా అడిగాడు.

'అది కాదు, మరిఅబద్ధం చెప్పమన్నావా? అబద్ధాలు చెప్పొచ్చా? చెప్పకూడదు, కదూ నాన్నా!'

మావయ్య నవ్వుతూ అన్నాడు: 'నిజం తగలేసిరి. స్నేహితుడు గదా! పాపం, వాణ్ణి ఒళ్లు వాయగొట్టించావు. నిన్ను కొడితే ఎట్లా ఉంటుందిరా?'

తల్లి అందుకుని 'ఔనురా, అబ్బాయి! నీ కెందుకురా, ఊరుకో పోయావూ!' అంది.

'అదికాదే అమ్మా! మరే, అన్ని దెబ్బలు తిన్నాక రేపు మళ్ళీ వాడు బీడీ ముట్టుకోడే.'

'అది ఎంతవరకు సంభవమో కాని, ఈ కోపం మనసులో పెట్టుకుని వాడు నిన్నెప్పుడో ఏ సందులోనో పట్టుకుని చితక్కొడతాడు; అదిమాత్రం తప్పదు.' అన్నాడు మావయ్య— రౌడీపిల్లల చురుకుదనం ఎప్పుడో జీవితంలో చవిచూచాడల్లే ఉంది.

'ఔనురా అబ్బాయి! వాడు కొంచెం పెద్దవకూడాను' అంటూ తల్లి కొంచెం భయపడ్డది.

'ఆ! కొట్టడమే! నన్నా? మా నాన్న లేడూ?' నిర్భయంగా అన్నాడు కృష్ణుడు.

జగన్నాధపండితుడి హృదయం పొంగిపోయింది. సర్వవేళలా, వాడు ఎక్కడున్నా, మీద ఈగ వాలకుండా కనిపెడుతూండవలసిన బాధ్యత తనమీద వేసి నిశ్చింతగా ఉన్నాడు. కుఱ్ఱవాడి అఖండవిశ్వాసం! అదే భక్తియోగ రహస్యం. పండితుడు అభయవరముద్రేమీ ప్రదర్శించలేదు. కాని ఆభావమే ఆయన చిరునవ్వులో ద్యోతకమయింది.

బావమరదులు భోజనంచేసి లేచారు. కృష్ణుడుకూడా లేచి మెల్లా లోనికి గంతులువేసుకుంటూ వెళ్ళాడు— నాన్న చెయి కడుక్కుని వచ్చేలోగా, పుస్తకం కుట్టించుకోడానికి కాగితాలు, సూది, దారం సిద్ధంగా ఉంచటానికి.

---

# సీమవంకాయచారు

సీమ వంకాయబద్దలువేసి నిమ్మకాయ పులుసుతో కాచినచారు రుచిగాను, ఆరోగ్యకరంగాను వుంటుంది.

ఈ చారు కాచడానికి కావలసినవి: రెండు నిమ్మకాయలు- రెండు సీమవంకాయలు- కొద్దిగా మిరియాలపొడి- చారెడు కందిపప్పు (అవసరంలేని వారు దీనిని మానివేయవచ్చు: ఈపప్పు రసాన్ని చిక్కపరచడానికి మాత్రమే ఉపయోగిస్తారు)—కొద్దిగా మిరపకాయల పొడి— కొద్దిగా ఆవాలు— కొంచెం నూని— కరివేపాకు—ఉప్పు.

మొదట పప్పును మెత్తగా ఉడికించాలి. పప్పు ఉడుకుతూవుండగా ఒక చిటికెడు పసుపుపొడివేయడం మంచిది.

పప్పు ఉడికినతరవాత దింపి తెడ్డుతో ఎనిపి రెండు చిన్నగ్లాసుల నీళ్లుపోసి తిరిగి పొయ్యిమీద పెట్టాలి.

రెండునిమిషాలు కలియపెట్టి నిమ్మకాయలరసం అందులో పిండాలి. వలసినంత ఉప్పు చేర్చాలి. తరవాత మిరియాల పొడి, మిరపకాయలపొడి కలిపి కలియపెట్టాలి.

ఈలోగా సీమవంకాయల్ని చిన్న చిన్న ముక్కలుగా తరిగి వుంచుకుని అందులో వేయాలి. తిరిగి ఒక చిన్న గ్లాసుడు నీళ్లు పోసి సీమవంకాయ ముక్కలు మెత్తగా ఉడికేవరకు సన్నని సెగను కాగబెట్టాలి.

అప్పుడు ఆవాలు నూనెలో వేపించి తిరగమోత పెట్టాలి.

కలియపెట్టి పొయ్యిమీదనుంచి దింపి కరివేపాకువేసి మూతపెట్టాలి.

వేడిగా వుండగానే పోసుకోవడం మంచిది.

నిమ్మకాయలు లేకవయితే ఈ రసం చిరుచేదుగా వుంటుంది. కాబట్టి లేత నిమ్మకాయలు ఉపయోగించే సందర్భంలో అంతా తయారై కిందకు దింపిన తరవాత రసం పిండడంమంచిది.